సాక్షి

# రైడ్.. రైట్ రైట్

**జేబీఎస్, ప్యారడైజ్ మెట్రో స్టేషన్ల నుంచి సేవలు షురూ**

- విమెన్ బైక్ సర్వీసులను ప్రారంభించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

## మెట్రో ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి ఎలక్ట్రిక్ వాహనాలు

**సాక్షి, సిటీబ్యూరో:** మెట్రో మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మహిళా డ్రైవర్లే నడిపేలా తొలిసారిగా నగరంలో పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటో రిక్షాలను హైదరాబాద్ మెట్రోరైల్ ప్రవేశపెట్టింది. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సీఈఓ కేవీబీ రెడ్డి విమెన్ ఈ– బైక్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం సికింద్రాబాద్, ప్యారడైజ్, జేబీఎస్ తదితర మెట్రో స్టేషన్‌లకు రాకపోకలు సాగించే మహిళా ప్రయాణికులకు ఈ సేవలు లభిస్తాయి. దశలవారీగా అన్ని మెట్రో స్టేషన్‌లకు విస్తరించనున్నారు. మహిళా ప్రయాణికుల భద్రత, సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని మహిళలే నడిపించేలా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నగరంలో మెట్రో స్టేషన్‌లకు ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం అందజేస్తున్న వాటిల్లో 9వ సంస్థగా ఈవీజిప్ సంస్థ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలతో, మహిళా కెప్టెన్‌లతో తన సేవలను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం నగరంలో ప్రతి రోజు సుమారు 5 లక్షల మంది మెట్రోల్లో ప్రయాణం చేస్తుండగా ప్రస్తుతం 1.25 లక్షల మందికి ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం లభిస్తుందన్నారు. మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన విమెన్ ఎలక్ట్రిక్ వాహనాలు ఒక మైలురాయిగా నిలుస్తాయన్నారు. ప్రస్తుతం ఉత్తరం వైపు ఉన్న అల్వాల్, తిరుమలగిరి, మారేడుపల్లి, సుచిత్ర తదితర ప్రాంతాలకు చెందిన మహిళా ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ఉబర్, ఓలా తరహాలోనే మొబైల్ ఫోన్లలో 'ఈవీ జిప్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విమెన్ బైక్, విమెన్ ఆటో రైడ్‌ను బుక్ చేసుకోవచ్చు. సయోధ్య స్వచ్ఛంద సంస్థకు చెందిన సుమారు 50 మంది మహిళా కెప్టెన్‌లు (డ్రైవర్‌లు) ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ డ్రైవింగ్ సదుపాయాన్ని అందజేస్తారు.




ఈ- బైక్ సేవలను ప్రారంభిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

### ప్రపంచ నగరాలతోనే పోటీ...

అభివృద్ధిలో హైదరాబాద్ ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతోనే పోటీపడాలని విజన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్ధేశం చేస్తున్నారని, అందుకనుగుణంగా నగరంలో ఇప్పుడున్న 69 కిలోమీటర్ల మెట్రో సదుపాయాన్ని రెండో దశ విస్తరణతో 200 కిలోమీటర్లకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టినట్లు ఎన్వీఎస్ తెలిపారు. పాతబస్తీ మెట్రో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రోడ్ల విస్తరణ కోసం 1100 నిర్మాణాలను తొలగించాల్సిన ఉందని, ఇప్పటి వరకు 270 మంది తమ ఆస్తుల అప్పగింతకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని చెప్పారు. వారిలో 170 మందికి సుమారు రూ.80 కోట్ల వరకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. కూల్చివేతల పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్రం అనుమతి లభించిన వెంటనే మెట్రో రెండో దశ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎల్అండ్‌టీమెట్రో సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ, త్వరలో రామయదుర్గం, హైటెక్‌సిటీ స్టేషన్‌లకు కూడా మహిళా కెప్టెన్‌ల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎల్అండ్‌టీ మెట్రో స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీధరన్, ఈవీ జిప్ సంస్థ వ్యవస్థాపకులు సీతారాం, సయోధ్య సంస్థ వ్యవస్థాపకులు మృదుల తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక శిక్షణ తీసుకున్నాం



ఈవీ బైక్‌లు నడిపేందుకు సయోధ్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాం. మహిళా ప్రయాణికులు ఇంటి నుంచి మెట్రోకు, తిరిగి తమ కార్యాలయాలకు చేరుకొనేలా వాహనాలు అందుబాటులో ఉంటాయి. స్నేహపూర్వకమైన రవాణా సదుపాయం అందజేస్తాం.

– స్వర్ణలత, అన్నోజిగూడ

### ఉపాధి అవకాశం



బండి నడపడం వచ్చు. డ్రైవింగ్‌నే ఒక ఉపాధిగా మలుచుకొనేందుకు ఈ రంగంలోకి వచ్చాను. మహిళా ప్రయాణికులకు మాత్రమే కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండదు. నిశ్చింతగా డ్రైవింగ్ చేయవచ్చు.

– శైలజ, అంబర్‌పేట్

### ఆసక్తి ఉన్నవాళ్లకు శిక్షణనిస్తాం



డ్రైవింగ్ పట్ల ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించాలనేది మా సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఆటోడ్రైవర్లు, బైక్ డ్రైవర్లు ఉన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లకు కారు డ్రైవింగ్‌లో కూడా శిక్షణనిప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

– మృదుల, సయోధ్య వ్యవస్థాపకురాలు